క్లుప్తంగా

అక్రమ మద్యం స్వాధీనం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పరిధిలోని తోటపేటలో రూ.3,900 విలువైన 28 అక్రమ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ద్రాక్షారామ ఏఎస్సై ఎస్ఎస్ భుజంగరావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు తోటపేటలోని దుకాణాల్లో సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దవులూరి అర్జునరావుకు చెందిన దుకాణంలో అక్రమ మద్యం పట్టుబడింది. నిందుతుడిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

ప్రజలకు వైద్యం చేరువ



తాతపూడిలో శిశువును పరీక్షిస్తున్న డాక్టర్ అనూజ ప్రియాంక

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు వైద్యం చేరువైందని అంగర పీహెచ్‌సీ డాక్టర్ జె.అనూజ ప్రియాంక అన్నారు. తాతపూడి బీసీ ఏరియాలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూజ ప్రియాంక 63 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి రాలేని బాలింతలు, శిశువుల ఇంటికి వెళ్లి ఆరోగ్యాన్ని పరీక్షించారు. వృద్ధుల ఇళ్లకు వెళ్లి బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి జాగ్రత్తలు చెప్పారు. శిబిరంలో పీహెచ్‌సీ, 104 సిబ్బంది సేవలందించారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

కె.గంగవరం: విద్యారంగాన్ని అభివృద్ధి చేసి, పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, చప్పిడి శ్రీను, అనుసూరి సాయి అన్నారు. మండలంలోని యర్రపోతవరం, శివల, తాళ్లపోడు గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను వారు గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, చదువులో రాణించి, గ్రామానికి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వాలు ఎన్నడూ పేదలను పట్టించుకోలేదని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమే పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు విద్యారంగ అభివృద్ధికి జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, నాడు–నేడు వంటి పథకాలను పక్కాగా అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మేడిశెట్టి రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

కపిలేశ్వరపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలు ఎం.బేబీ, కార్యదర్శి రాణి, ఆయా మండలాల నాయకులు ఎం.జానకిదేవి, వీరవేణి, కుమారి, వజ్రం మాట్లాడుతూ బకాయి వేతనాలు, టీఏ, డీఏ బిల్లులను చెల్లించాలన్నారు. సీడీపీఓ కార్యాలయ ఎల్‌డీసీ మురళికి వినతిపత్రం అందజేశారు.

రాయవరం: ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అందించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం రాయవరంలో ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ నేతలు ఎస్.కృష్ణకుమారి, డి.ఆదిలక్ష్మి, ఎం.దుర్గమ్మ, వై.పద్మావతి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

దాడి ఘటనపై కేసు

రాయవరం: తనపై దాడి చేసినట్లు డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామని రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చెల్లూరు శివారు బత్తులవారి సావరంలో వైష్ణవి డ్వాక్రా గ్రూపును నిర్వహిస్తున్నారు. గ్రూపు అధ్యక్షురాలిగా ఉన్న బారాటి వీరవేణి డ్వాక్రా సంఘం సభ్యుల నుంచి నెలవారీ డబ్బులు వసూలు చేయడానికి సభ్యురాలైన నేల కుమారి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో కుమారి, ఆమె కుమారుడు శేఖర్‌లు దాడి చేసినట్లు పోలీసులకు వీరవేణి ఫిర్యాదు ఇచ్చింది.

భూములపై విచారణకు కమిటీ

ఆత్రేయపురం: కట్టుంగలో ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూములపై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వెలిచేరు గ్రూప్ టెంపుల్స్ ఈఓ ఎ.సత్యవర్ధనరావు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానికియమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాస్‌లతో ఈ విచారణ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఈ భూములపై ‘సాక్షి’ ప్రచురించిన వరుస కథనాలకు దేవదాయ, ధర్మదాయ అధికారులు స్పందించారు. ఈ భూములకు అప్పనపల్లి ఆలయ ఈఓ, కట్టుంగ ఆలయ ప్రత్యేకాధికారి వీవీవీఎస్ఎన్ మూర్తి, అప్పటి దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ భ్రమరాంబ ఆధ్వర్యాన 2015లో వేలం పాటలు నిర్వహించారు. 18.05 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.6.91 లక్షల ఆదాయం వచ్చింది. ఆ సొమ్ముపై విచారణ నిర్వహించి, వేలం నిర్వహించిన భూములను పాటదారులకు అప్పగిస్తామని ఈఓ కృష్ణచైతన్య చెప్పారు.

ముందస్తుగా సాగుదామా..

- ఆదాయం తెచ్చే వంగడాలకే ప్రాధాన్యం
- లాభసాటి సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ కసరత్తు



మండపేటలో సిద్ధమవుతున్న నారుమడి

మండపేట: ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలతో రైతన్న ఏరువాక ‘సాగు’తున్నారు.. పసిడి కాంతులు పండించాలని ముందుకు వెళ్తున్నారు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ముందస్తు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మార్కెట్‌లో మంచి రాబడి తెచ్చే వంగడాలను సాగు చేయించి రైతులకు అధిక లాభాలు తెచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మేలు జాతి వంగడాలు, సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 94 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో మోటార్ల కింద నారుమడులు, వెదజల్లు సాగు పనులు చేపట్టారు. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. వాటిని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచింది. జూలై 15వ తేదీకి వెదజల్లు, నాట్లు వేయడం పూర్తి చేయాలని సూచిస్తోంది. తొలకరిని లాభసాటి చేసేందుకు మార్కెట్‌లో రాబడినిచ్చే వంగడాల సాగు చేసేలా చైతన్యవంతం చేస్తోంది.

ఏం సాగు చేయాలంటే..

ఖరీఫ్‌లో ప్రధానంగా బీపీటీ – 5204 (సాంబ మసూరి), ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1064 (అమర), ఎంటీయూ 1061 (ఇంద్ర), పీఎల్ఏ 1100 (ఐడవ మసూరి), ఎంటీయూ 1318, విత్తనాల కోసం తక్కువ విస్తీర్ణంలో ఎంటీయూ 1121 (శ్రీధృతి) సాగు చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తొలకరి సాగుకు ఇవి అనుకూల రకాలని అంటున్నారు. ఎక్కువ సాగు కాలం ఉన్న ఎంటీయూ 1318, పీఎల్ఏ 1100, ఎంటీయూ 1064 రకాలను ముందుగానే సాగు చేసుకోవడం వల్ల సకాలంలో రెండో పంట దాళ్వాకు వీలుంటుంది. దాళ్వాకు విత్తనాలు కావాల్సిన వారు ఎంటీయూ 1121, ఎంటీయూ 3626 వంటి రకాలను కొద్దిపాటి విస్తీర్ణంలో మాత్రమే సాగు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

- దుక్కిదున్ని వెదజల్లే పద్ధతి సాగుకు ఎకరానికి 20–25 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. దమ్ముచేసి వెదజల్లే పద్ధతికి 12–15 కిలోల విత్తనం కావాలి. నారుమడికి ఎకరానికి 20 కిలోల విత్తనం మాత్రమే వాడాలి.
- ఎంటీయూ 3626 (ప్రభాత్, బొండాలు), ఎంటీయూ 1001 (విజేత), ఎంటీయూ 1010 (కాటన్‌దొర సన్నాలు), ఎంసీ 13 (టాటా బొండాలు), ఎంటీయూ 1156 (తరంగణి), ఎంటీయూ 1153 (చంద్ర) రకాలను సాగు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. మన నేల స్వభావానికి, వాతావరణ పరిస్థితులకు ఈ రకాలు అనుకూలం కావు. అలాగే బొండాలకు మార్కెట్ లేకపోవడంతో ఆశించిన లాభాలు రావు.

రైతుల్లో చైతన్యం నింపుతున్నాం



తొలకరి సాగుకు రైతులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. పంట చివర్లో తుపాన్ల బెడద లేకుండా చేయడం, మూడో పంటగా అపరాల సాగు కోసం ముందస్తు సాగుకు రైతులను సిద్ధం చేస్తున్నాం. జూన్ 1వ తేదీనే కాలువలకు నీరు విడుదల కావడంతో నారు మడులు సిద్ధం చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

– కె.ఏసుబాబు, మండపేట వ్యవసాయాధికారి

యువతను సన్మార్గంలో నడిపేందుకు కృషి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

మండపేట: చెడు వ్యసనాలకు లోనై జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతను మేల్కొలిపి సన్మార్గంలో నడిపేందుకు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) కృషి చేస్తుందని సంస్థ మండపేట శాఖ సభ్యులు తెలిపారు. యువతా మేలుకో.. సమస్యలను జయించి భవిష్యత్తును నిర్మించుకో అనే నినాదంతో ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ప్రత్యేక ఉద్యమ కార్యాచరణ చేస్తున్నట్టు వివరించారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కన్వీనర్ సూహైబ్ మాట్లాడుతూ యువకుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యక్రమంలో అంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ సభ్యులు ఏఎస్ అతీక్, బీఆర్ అబీద్, వసీం, తల్హా, మాజ్, గఫూర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



కాలేరులో జగనన్న విద్యా కానుకలు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనే సంస్కరణలు చేపట్టిందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అన్నారు. కపిలేశ్వరపురం, టేకి, కాలేరు గ్రామాల్లో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుకల కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. మండలంలోని 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలకు చెందిన 3,777 మందికి విద్యా కానుకలను అందజేశారు. సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, దాయం కావేరి, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, టేకి సత్యమంజు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి దుర్గారావు, పలివెల మధు, కట్టా మురళి, విజయ్, సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన విద్య అందిస్తుందన్నారు.

భీమేశ్వరరావు కుటుంబీకులకు పరామర్శ

కాజులూరు: శీల గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమారి భర్త, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల భీమేశ్వరరావు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె కుటుంబీకులను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు అర్జునరావు తదితరులు గురువారం పరామర్శించారు. గ్రామ సర్పంచ్‌గా, శీల, ఒంటితాడి ఎంపీటీసీ సభ్యులుగా, మంజేరు పీఏసీఎస్ చైర్మన్‌గా భీమేశ్వరరావు చేసిన సేవలను వారు కొనియాడారు. యూటీఎఫ్ నేతగా తండ్రి దడాల మీరా సాహెబ్ ఆశయాలకు అనుగుణంగా భీమేశ్వరరావు మంచి కమ్యూనిస్టు నాయకుడిగా సమాజానికి సేవ చేశారని అన్నారు. రెండు దశాబ్దాల కిందట ఉధృతంగా సాగిన కూలి పోరాటంలో ఆయన భాగస్వామి అయ్యారని అన్నారు. పరామర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం తాళ్లరేవు కార్యదర్శి అదృష్టదీపుడు తదితరులున్నారు.

దిశ యాప్‌పై అవగాహన



మండపేటలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న సీఐ శివగణేష్, పోలీసులు



కె.గంగవరంలో దిశ యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కపిలేశ్వరపురం: వ్యక్తిగత, సామాజిక రక్షణ కోసం ప్రతి ఒక్కరి ఫోన్‌లో దిశ యాప్ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం యాప్ ఇన్‌స్టాలేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం ప్రారంభించింది. రెండో రోజైన గురువారం అంగర ఎస్సై జి.చంటి ఆధ్వర్యంలో 18 మంది మహిళా పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమం నిర్వహించారు. అంగర గాంధీ సెంటర్, కపిలేశ్వరపురం గోదావరి గట్టు, వెదురుమూడి సెంటర్లలో దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు రోజుల్లో సుమారు 15 వేల మంది తమ ఫోన్‌లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

కె.గంగవరం: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో దిశ యాప్‌పై పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వాహనదారులను ఆపి వారి ఆండ్రాయిడ్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసి అవగాహన కల్పించారు. మహిళల రక్షణ విషయంలో వెన్నంటే ఉంటామని, రాజీ పడే ప్రసక్తే లేదని ఎస్సై కె.చిరంజీవి చెప్పారు. ఆపదలో ఉన్న మహిళలు దిశ యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కినా, లేక ఫోన్ షేక్ చేసినా దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. రెండు రోజుల పాటు ఈ డ్రైవ్ నిర్వహించి, లక్ష్యం పూర్తి చేస్తామని చెప్పారు.

మహిళలకు రక్షణ

మండపేట: మహిళల భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియ మండపేట, మండల గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతోంది. ప్రతి మహిళ స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్ ఉండాలన్న లక్ష్యంతో మండపేట సీఐ పి.శివగణేష్ నేతృత్వంలో పట్టణ ఎస్ఐలు ఎం.అశోక్, కె.అప్పారావు, రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ, పోలీస్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. స్థానిక బస్టాండ్, కలువపువ్వు సెంటర్, రాజారత్న సెంటర్ తదితర ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు డ్రైవ్ చేపట్టారు. యాప్ ప్రాధాన్యం, ఆపద ఎదురైనప్పుడు ఎలా రక్షణ పొందవచ్చనే విషయాలను మహిళలకు వివరిస్తున్నారు. సీఐ శివగణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన దిశ యాప్ మహిళలకు శ్రీరామ రక్షగా నిలుస్తుందన్నారు. ఉద్యోగాలు చేసే మహిళలు, ఒంటరిగా ఉండేవారు, యువతులు ముఖ్యంగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మొబైల్‌లో సిగ్నల్ లేకపోయినా యాప్ పనిచేస్తుందన్నారు. ఆపద ఎదురైనప్పుడు దిశ యాప్‌ను ఉపయోగిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందుతుందన్నారు.

డిక్కీ దొంగల అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

రామచంద్రపురం: స్కూటర్ డిక్కీలు తెరచి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ గురువారం మీడియాకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాయవరం మండలం మాచవరానికి చెందిన నల్లమిల్లి దొరరెడ్డి తన రైస్ మిల్లు పరిధిలోని రైతులకు ఇచ్చేందుకు పట్టణంలోని ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో ఈ నెల 8న రూ.3.55 లక్షలు డ్రా చేశారు. ఆ సొమ్మును తన స్కూటర్ డిక్కీలో ఉంచారు. అనంతరం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏటీఎం వద్దకు వెళ్లేందుకు స్కూటర్‌ను పార్క్ చేశారు. ఏటీఎం నుంచి తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు డిక్కీ తెరచి నగదు అపహరించుకుపోయారు. దొరరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రసాద్, సీఐ దుర్గారావు నేతృత్వంలో ఎస్సై డి.సురేష్‌బాబు బృందం ఈ కేసును వేగంగా విచారణ చేసింది. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. రామచంద్రపురం బైపాస్ రోడ్డు జంక్షన్‌లో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ముఖేష్‌కుమార్, రోహిత్‌కుమార్‌గా గుర్తించారు. మండపేట సమీపంలోని తాపేశ్వరానికి సీలింగ్ పనుల నిమిత్తం వచ్చిన వారి వద్ద వీరిద్దరూ ఉంటూ, ఇలా దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది. ఈ నిందితులు ఇదేవిధంగా పాలకొల్లు, అమలాపురం, మండపేటల్లో కూడా డబ్బులు దొంగిలించినట్టు తేలింది. విచారణ అనంతరం తాపేశ్వరంలో వారుంటున్న రూములో దాచిన సొమ్మును పోలీసులు రికవరీ చేసి, ముద్దాయిలను అరెస్టు చేశారు. ఈ కేసును చాకచక్యంగా, త్వరితగతిన ఛేదించిన క్రైం సీఐ గోవిందరావు, ఎస్సై సురేష్ బాబు, హెడ్ కానిస్టేబుళ్లు వీరబాబు, మల్లికార్జునరావు, కానిస్టేబుళ్లు జగదీష్, సూరిబాబు, అనిల్, హోంగార్డు మహేష్‌లను ఎస్పీ ఎస్.శ్రీధర్ అభినందించారు. వారికి డీఎస్పీ ప్రసాద్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

సచివాలయ సేవలను వినియోగించుకోండి



లబ్ధిదారుడికి ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఆర్డీఓ సింధుసుబ్రహ్మణ్యం

రాయవరం: సచివాలయాల ద్వారా భూముల కొనుగోళ్లు, అమ్మకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధుసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. చెల్లూరు సచివాలయం –1 వద్ద ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ముంగిటకే అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. భూముల కొనుగోళ్లు, అమ్మకాలకు సచివాలయ పరిధిలోనే రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కల్పించిన ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలోని లొల్ల, వెదురుపాక, నదురుబాద, పసలపూడి, సోమేశ్వరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు అవకాశముందన్నారు. అనంతరం లబ్ధిదారుడికి ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాలను ఆర్డీఓ సింధుసుబ్రహ్మణ్యం అందజేశారు. తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలు
దేశానికే ఆదర్శం



సిరిపురపు శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నాయకులు, గ్రామస్తులు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు, రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నదురుబాదలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ టీడీపీలో హయాంలో రైతులు సాగుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చేదన్నారు. నేటి ప్రభుత్వం పెట్టుబడి సాయం కోసం ఇతరులపై ఆధారపడకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. దీనిద్వారా రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సొమ్మును నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. వ్యవసాయం దండగ కాదు పండగ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

శ్రీనివాసరావుకు పౌర సత్కారం

మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సిరిపురపు శ్రీనివాసరావుకు నదురుబాదలో పౌర సత్కారం జరిగింది. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న వారికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి సిరిపురపు నియామకమే నిదర్శనమని వక్తలు అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో అయన్ని సత్కరించారు. ఎమ్మెల్సీ తోటను శ్రీనివాసరావు సన్మానించారు. సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త తేతల సుబ్బరామారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణ పాల్గొన్నారు.

పోషకాల గని.. నేరేడు

- వేసవిలోనే లభించే ఫలం
- లంకల్లో విరివిగా లభ్యం
- కిలో రూ.200కు విక్రయం



నేరేడు పండ్లు



నేరేడు చెట్టు కొమ్మకు విరగ కాసిన కాయలు, పండ్లు

ఆలమూరు: కరోనా తరువాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై స్పృహ పెరిగింది. ఫలితంగా తాజా ఆకు కూరలు, కూరగాయలతో పాటు పండ్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సాధారణంగా వేసవిలో లభించే మధుర ఫలం మామిడి అంటే అందరికీ ఇష్టమే. కానీ, ఇంచుమించు ఇదే సీజన్‌లో అంటే జ్యేష్ఠం నుంచి శ్రావణ మాసం వరకూ లభించే పండు నేరేడు. ఈ చెట్లను చాలా మంది ఇళ్ల వద్ద ఖాళీ స్థలాల్లో పెంచుతారు. అలాగే, గోదావరి పరీవాహక ప్రాంతాలు, లంక భూముల్లో ఈ చెట్లు విరివిగా ఉన్నాయి. అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలోని మన్యం, చాగల్నాడు ప్రాంతాల్లో కూడా నేరేడు పండ్లు అధికంగా లభిస్తాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో ఈ పండ్లు మార్కెట్‌లో విస్తృతంగా కనిపిస్తున్నాయి. రైతు వద్ద దళారులు కేజీ రూ.80 చొప్పున కొనుగోలు చేసి రిటైల్ వ్యాపారులకు రూ.150కి విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారులు వీటిని వినియోగదారులకు కిలో రూ.200 వరకూ అమ్ముతున్నారు. నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి, వాటిని మరింత లాభసాటి ధరకు విక్రయిస్తున్నారు.

రుచిలో మేటిగా ఉండే నేరేడు పండుకు పోషకాల గనిగా పేరుంది. సక్రమంగా వినియోగించుకుంటే ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. పండు మాత్రమే కాదు.. ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. నేరేడు పండుతో ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌లు కూడా తయారు చేస్తుంటారు. నేరేడు కాయలను వెనిగర్, మద్యం తయారీలో ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం నేరేడు పండు ఎన్నో ఔషధ లక్షణాలు కలిగి ఉంది. వేసవిలో ప్రతి రోజూ కనీసం ఒక్క నేరేడు పండు తింటే వ్యాధులకు, అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు విటమిన్–ఎ, సి పుష్కలంగా ఉంటాయి. దీనివలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయ పని తీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పని చేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లో చెడు బ్యాక్టీరియా నశించి, దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకు పోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.

మితిమీరి తింటే దుష్ఫలితాలు

- నేరేడు పండ్లు మితిమీరి తింటే దుష్ఫలితాలు ఎదురవుతాయి. వగరు రుచి కలిగిన నాణ్యత లేని పండ్లు తింటే గొంతు నొప్పి రావచ్చు. సీజన్ మారే సమయంలో ఈ పండ్లను మితంగానే తినాలి.
- ఉబ్బసం బాధితులు ఈ పండ్లు ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణ వ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది.